క్లుప్తంగా

చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, పట్టణ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన కందుల ఓదెలుకు వైద్య ఖర్చుల కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వం నుంచి రూ.3.75లక్షల విలువైన ఎల్‌వోసీని ఓదెలు కుమారుడికి ఆదివారం అందజేశారు. ఓదెలు గుండె చికిత్స చేయించుకోవడం కోసం మంత్రికి విన్నవించగా ప్రభుత్వం నుంచి ఎల్‌వోసీ మంజూరు చేయించి అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

సుల్తానాబాద్: మున్సిపల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ జోనల్ అసిస్టెంట్ మేనేజర్ ఫార్మాచారి అన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో అధికారులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ సర్వేను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ ఉన్నారు.

టీజీవో జిల్లా అధ్యక్షుడిగా రవీందర్


పుష్పగుచ్ఛం అందజేస్తున్న తూము రవీందర్

సుల్తానాబాద్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తూము రవీందర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సెంట్రల్ కమిటీ సమావేశంలో ప్రకటించినట్లు రవీందర్ తెలిపారు.

దుస్తులు పంపిణీ

మంథని: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని పేద క్రైస్తవులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. మంథనిలోని సియోను ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్ వల్లూరి ప్రభాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, దూడ మహేశ్, జోసెఫ్, మంథని ప్రసాద్, ప్రేమ్‌కుమార్, అందె రమేశ్, ఈర్ల సదానందం, కుమార్ ఉన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

గోదావరిఖనిటౌన్: పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సీఎం కప్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గోదావరిఖనికి చెందిన ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థిని జి.సహస్ర ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా మాస్టర్ షిహాన్ కరాటే మొండయ్య, సీనియర్ కోచ్ క్రాంతికుమార్ విద్యార్థిని అభినందించారు.

దరఖాస్తులు ఆహ్వానం

ముత్తారం: మండలంలోని ధర్యాపూర్ మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం పరీక్ష షెడ్యూల్ విడుదలైందని ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. 2025 జనవరి 6 నుంచి ఫిబ్రవరి 20 వరకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

సన్నరకం వరిసాగుకు మొగ్గు

- 13,300 ఎకరాలకు దాదాపు 10వేల ఎకరాల్లో సాగు
- ఎలిగేడు మండలంలో యాసంగి పనులు ప్రారంభించిన రైతన్న


ఎలిగేడులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ఎలిగేడు: ఖరీఫ్ సీజన్ రైతులకు వరి ధాన్యం చేతికంది, ధాన్యం కొనుగోళ్లు పూర్తయి దాదాపుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. దీంతో రైతులు యాసంగి పంటలు సాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. యాసంగి వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఎలిగేడు మండలం పూర్తిగా ఎస్సారెస్పీ డి-86 ఆయకట్టు కావడం యాసంగికి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తారని, చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరు ఉంది. దీంతో వ్యవసాయ బావులను ఆధారం చేసుకుని రైతులు వరినాట్లు ప్రారంభించారు.

దుక్కులు దున్నుతున్నారు..

యాసంగి పంటలను సాగు చేసే క్రమంలో రైతులు నార్లు పోసుకుని, దుక్కులు దున్నుతున్నారు. ఎలిగేడు, లాలపల్లి, సుల్తాన్‌పూర్, ధూళికట్ట తదితర గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. మండలంలోని 12 గ్రామాల్లో 15,300 సాగు విస్తీర్ణం ఉండగా ఈ యాసంగిలో 13,300 ఎకరాల్లో వరిసాగు, 150ఎకరాల్లో మొక్కజొన్న, 50ఎకరాల్లో కూరగాయల సాగు అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

పెరగనున్న సన్నరకం సాగు..

రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వరిధాన్యానికి ఈ ఖరీఫ్ సీజన్‌కు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడంతో ఈ యాసంగిలో రైతులు సన్నరకం వరిసాగుకు మొగ్గు చూపుతున్నారు. గతేడాది యాసంగిలో మండలంలో 13,087 ఎకరాల వరిసాగు చేయగా అందులో 10వేల ఎకరాల్లో దొడ్డురకం వరి సాగు, కేవలం 3087ఎకరాల్లో సన్న రకం సాగు చేశారు. ఈ యాసంగిలో 13,300 ఎకరాలకు 10వేల ఎకరాలు సన్నరకం వరిసాగు, కేవలం 3,300 ఎకరాలు దొడ్డు రకం వరిసాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

యాసంగికి అందుబాటులో ఎరువులు

యాసంగి పంటకు రైతులకు ఎరువులు యూరియా 110 మెట్రిక్ టన్నులు, డీఏపీ 20టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 150టన్నులు, పొటాష్ 8టన్నులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

సలహాలు, సూచనలు పాటించాలి



రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. వరిలో సల్ఫేడ్ ఇన్‌జ్యూరీని అరికట్టేందుకు రెండు రోజులకోసారి నారుమడికి పాత చల్లని నీటిని తొలగించి, గోరువెచ్చని నీరు పెట్టాలి. జింక్ లోపం అధిగమించేందుకు దుక్కిలో జింక్‌ను స్ప్రే చేయడం, సల్ఫేడ్‌ను వేసుకోవాలి. నాటువేసే వారంరోజుల ముందు నారుమడిలో 3జీ గుళికలను చల్లి ఇంకేలా చేస్తే వరికి మొగిపురుగు రాకుండా ఉంటుంది.

– ఎం.ఉమాపతి, మండల వ్యవసాయ అధికారి

సింగరేణి వార్తలు

యాజమాన్యంతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న కొరిమి రాజ్‌కుమార్

గోదావరిఖని: ఎన్నికలు వద్దన్న కార్మిక సంఘాలకు విమర్శించే హక్కులేదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఆర్జీ-1 ఏరియా జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు ఇచ్చిన హామీలను స్ట్రక్చర్ సమావేశాల్లో చర్చించి అంచెలంచెలుగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిస్తే తోటి కార్మిక సంఘాలు ఓర్వడం లేదన్నారు. సమస్యలన్నీ ఒకేసారి పరిష్కారం కావని, పద్ధతి ప్రకారంగా యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారం చేస్తామన్నారు. సింగరేణికి రావాల్సిన రూ.33వేల కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తేనే సంస్థ మనుగడ కొనసాగుతుందన్నారు. యూనియన్ సభ్యత్వానికి కార్మికవర్గం సహకరించి యూనియన్‌ను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి పోషం, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, గౌతం గోవర్ధన్, రంగు శ్రీను, ఎస్.వెంకట్‌రెడ్డి, జోగ సతీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-3, ఏపీఏ ఉత్తమ ఉద్యోగుల ఎంపిక


ఎ.కోటయ్య


డి.అశోక్


రామకృష్ణ

రామగిరి: సింగరేణి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ-3, ఏపీఏ ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీ-3 ఏరియాలో ఓసీపీ-1 అడిషనల్ మేనేజర్ అందె కోటయ్య, సివిల్ విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ నందమూరి రామకృష్ణ, ఓసీపీ-2 ఈపీ ఆపరేటర్ కుమ్మరి లక్ష్మీనారాయణ, ఓసీపీ-1 జనరల్ మజ్దూర్ పొన్నం రాజయ్య, ఏపీఏ ఏరియా నుంచి డిప్యూటీ మేనేజర్ దూడిపాల అశోక్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాగేటి యాదగిరి, సీనియర్ మైనింగ్ సర్దార్ కోదాటి సంపత్‌రావు, మల్టీ జాబ్‌వర్కర్ మరియదాస్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగాణంలో సోమవారం నిర్వహించనున్న సింగరేణి దినోత్సవంలో వీరిని సన్మానిస్తామన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం


సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు

రామగిరి: మండలంలోని సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో ఆదివారం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సమావేశంలో భాగంగా ఈ నెలలో స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించుకున్నారు. నూతన కమిటీలను ఏర్పాటు చేసుకుని రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందించాలన్న పలు తీర్మానాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ కార్మికులు గౌతం శంకరయ్య, జవహర్, శేషు, లక్ష్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఫెర్టిలైజర్‌సిటీ: శోభాయాత్రలో స్వాములు


జ్యోతినగర్: పూజల్లో అయ్యప్పస్వాములు

ఘనంగా ఆరట్టు ఉత్సవం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ఆరట్టు ఉత్సవంలో భాగంగా అయ్యప్ప ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి అనుమభద్రయ్య, బాదె శ్రీనివాస్, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని చిలుకలయ్య ఆలయం ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం హారతి, అయ్యప్ప జెండా ఆవిష్కరించారు.

టీబీ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి


ర్యాలీలో పాల్గొన్న కాలనీవాసులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌ను టీబీరహిత పట్టణంగా తీర్చిదిద్దాలని ఆయుష్మాన్ మందిర్ డాక్టర్ సింధుజ అన్నారు. పట్టణంలోని గొల్లపల్లి, శ్రీరామ్ నగర్, సుభాష్ నగర్‌లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టీబీరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా పరీక్షలు చేస్తుందన్నారు. దగ్గు తగ్గకపోతే వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం అనుమానం ఉన్న రోగుల నుంచి తెమడను సేకరించారు. పలువురికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. టీబీ సూపర్‌వైజర్ సురేందర్, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, ఏఎన్‌ఎంలు సరస్వతి, శారద, ఆశాలు మరియమ్మ, రమాదేవి, స్వప్న, రమాదేవి పాల్గొన్నారు.

'నేనున్నా' స్వచ్ఛంద సంస్థకు విరాళం అందజేత


చెక్కు అందజేస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రఘువీర్‌సింగ్ తండ్రి దివంగత మహావీర్‌సింగ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రంలోని రఘువీర్‌సింగ్ వ్యవసాయ క్షేత్రంలో మహావీర్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన నేనున్నా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు రూ.50వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య, ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, లోక లింగారెడ్డి, లక్కాకుల శ్రీనివాస్, నిట్టు కొమురయ్య, రేచవేని మల్లేశం, శేఖర్, మేర శ్రీనివాస్, సాగర్, వెంకటరమణ పాల్గొన్నారు.


గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న జీఎం వెంకటయ్య


జ్యోతినగర్: నివాళి అర్పిస్తున్న నాయకులు

గడ్డం వెంకటస్వామి వర్ధంతి

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్/యైటింక్లయిన్ కాలనీ/జూలపల్లి/ఓదెల/జ్యోతినగర్/రామగిరి: స్వర్గీయ కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

బీజేపీ బూత్‌స్థాయి అధ్యక్షుల నియామకం


నియామక పత్రాలు అందజేస్తున్న తిరుపతి

జూలపల్లి: మండలంలోని వెంట్రావుపల్లెలో బీజేపీ సభ్యత్వం పూర్తి చేసుకుని పెద్దపల్లి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి తంగెడ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధ్యక్షుల నియామకం చేసినట్లు పార్టీ సీనియర్ నాయకులు వొల్లె తిరుపతియాదవ్ తెలిపారు. 287 బూత్ అధ్యక్షుడిగా వడ్లకొండ శ్రావణ్, కార్యదర్శిగా పెనుగొండ మహేశ్, 288 బూత్ అధ్యక్షుడిగా నేరేడుకొమ్మ సత్యనారాయణరావు, కార్యదర్శిగా జుట్టు కిరణ్ ఎన్నికయ్యారు. కాగా తిరుపతి నియామక పత్రాలు అందజేశారు. దాడి లక్ష్మయ్య, బడుగు శ్రీనివాస్, వేల్పుల శంకర్, కాల్వ తిరుపతి, దాడి సాగర్, సంపత్, శేఖర్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీ నిరుపేదల పక్షాన పోరాటం చేస్తుంది

యైటింక్లయిన్‌కాలనీ: నిరుపేదల పక్షాన నిలబడి పోరాటాలు చేసే పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ గోవర్ధన్ అన్నారు. ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు ప్రతీ శాఖలో ఎర్ర జెండాలు ఎగురవేయాలనాయన సూచించారు. కార్యక్రమంలో కమాన్‌పూర్ మండల కార్యదర్శి రాజారత్నం, నాయకులు, ప్రకాశ్, ఆంజనేయులు, భాస్కర్, అన్నారావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మినీ క్రిస్మస్ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

గోదావరిఖనిటౌన్: ఆర్టీసీ డ్రైవర్లు డేవిడ్, చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలో మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీఎస్ఐ చర్చి సంగ కాపరి రేవ్ లక్ష్మణ్ జాకబ్ మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. డిపో అధికారులు సంధ్యారాణి, హరి శేఖర్, లింగయ్య, అలీ మహ్మద్, ఉద్యోగులు అంజయ్య, ఆకాశ్, ముస్తాక్, అనిల్, విద్యాకర్, లత, రాజు, లక్ష్మణ్, సారయ్య, అబ్రహం, స్టీవెన్, తిరుమల, యోహాన్, భూమయ్య, రాంచందర్, టీకే స్వామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి కొన్నేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామానికి చెందిన గాదె సుధాకర్ గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల విషయమై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా రూ.3.60లక్షల నిధులతో ప్రధాన రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించారు. గ్రామంలోని పోచమ్మ ఆలయం వరకు ప్రధాన రహదారి, సీసీడ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.



కమాన్‌పూర్: మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంతతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వారసంతను అంగడి బజారులోని గల్లీలో నిర్వహిస్తున్నారు. ప్రతీవారం చిరు వ్యాపారులు ఎక్కువగా వస్తుండడంతో వ్యాపారులకు స్థలం లేక ప్రధాన రహదారి వెంట విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో దారి వెంట వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారసంతను ఆదివరాహస్వామి ఆలయానికి వెళ్లే దారికి ఇరువైపులా నిర్వహించి ఇబ్బందులు తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సంక్షిప్త వార్తలు

• భారతీయ సాంస్కృతిక, కళా పోటీలకు ఆహ్వానం

జ్యోతినగర్: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భారతీయ సాంస్కృతిక, కళా, నృత్య, వ్యాసరచన పోటీలతోపాటు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు, ఉత్తమ యువజన పురస్కారం, ఉత్తమ సేవా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి స్వప్న మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు నర్సరీ నుంచి పీజీ చదువుతున్న వారు అర్హులని, ఓపెన్ విభాగంలో వయస్సు, చదువు పరిమితి లేదని ఆయన తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త నిర్వహణలో మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఉత్తమ యువజన పురస్కారం, ఉత్తమ సేవా పురస్కారాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 30లోపు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 97046 52590, 80087 15158 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

• ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ అమలు చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్యాల శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దిలీప్‌రావు, అశోక్ రాజు, వెంకటేశ్వర్లు సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు రమేశ్ బాబు మద్దతు తెలిపారు.

• నేడు ప్రధాన అనఘాష్టమి వ్రతం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లోని సాయి సేవాసమితి ఆవరంలోని ఆలయంలో సామూహిక ప్రధాన అనఘాష్టమి వ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

• ఆటో, కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి–సుల్తాన్‌పూర్ రోడ్డులో ఆదివారం ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. గట్టెపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సంపత్‌తోపాటు సురేశ్, మరో అమ్మాయి ఆటోలో సుల్తాన్‌పూర్‌కు వెళ్తుండగా.. అటువైపు నుంచి గర్రెపల్లికి వస్తున్న కారు ఢీకొంది. సంపత్, సురేశ్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

• డ్రంకెన్ డ్రైవ్ వ్యక్తికి కమ్యూనిటీ సేవ

గోదావరిఖని: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు వినూత్న శిక్ష విధించింది. డ్రంకెన్ డ్రైవ్‌లో రెండోసారి దొరికిన జి.ప్రభుదాస్‌కు ఒకరోజు ట్రాఫిక్ కమ్యూనిటీ సర్వీస్ చేయాలని కోర్టు ఆదేశించింది. స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద ప్లకార్డుతో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ హరిశేఖర్ దగ్గరుండి సర్వీస్ చేయించారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన మరో 8మందికి రూ.18వేల జరిమానా విధించారు.

సీఎం కప్ జిల్లాస్థాయి చదరంగం పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో సురేశ్

సుల్తానాబాద్: చదరంగం మేధస్సుకు పదును పెడుతుందని డీవైఎస్‌వో సురేశ్ అన్నారు. సుల్తానాబాద్‌లోని శ్రీవాణి జూనియర్, డిగ్రీ కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి సీఎం కప్ చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం ఆడితే మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డాల శ్రీనివాస్, ఆర్బిట్ రామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, పేట కార్యదర్శి దాసరి రమేశ్, ఫిజికల్ డైరెక్టర్స్ ప్రణయ్, జావిద్, వెంకటేశ్, సదయ్య, సత్యం పాల్గొన్నారు.